గ్రామాలపై నిఘా నేత్రం

- గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుతో పెరిగిన పర్యవేక్షణ
- నేరాల నిరోధంలో కీలకంగా సీసీ ఫుటేజ్
- అనుమానితుల గుర్తింపులోనూ ఉపయోగం

కంకిపాడు: గత నెల 19న గోసాల ప్రధాన సెంటరులో రోడ్డు దాటుతున్న వ్యక్తిని వేగంగా వెళ్తున్న కారు ఢీకొంది. తక్షణమే సీసీ ఫుటేజ్ సేకరించి ప్రమాదానికి కారణమైన వాహనాన్ని కంకిపాడు పోలీసులు గుర్తించి, కేసును ఘటనాస్థలాన్ని ఆధారంగా చేసుకుని పెనమలూరు పోలీసులకు అప్పగించారు.

- అక్టోబరు 1న ఈడుపుగల్లు సెంటరులో అనుమానాస్పదంగా సంచరిస్తున్న నలుగురు వ్యక్తులను గుర్తించి అదుపులోకి తీసుకోగా, బైక్‌ల చోరీ ముఠా గుట్టురట్టయ్యింది. ఐదు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. అనుమానితుల కదలికలను సైతం సీసీ ఫుటేజ్ ద్వారానే గుర్తించారు.
- అక్టోబరు 9న పునాదిపాడు బొప్పన ఆయిలు మిల్లు సెంటరులో అనుమానాస్పదంగా సంచరిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని, నకిలీ తాళాలతో చోరీలకు పాల్పడే నిందితుడిగా నిర్ధారించారు. అతని వద్ద నుంచి 38 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఇది కూడా సీసీ ఫుటేజ్ ఆధారంగానే గుర్తించారు.

ఇవి కేవలం కొన్ని ఉదాహరణలు మాత్రమే. అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని పూర్తి స్థాయిలో వినియోగించుకుంటూ నేరాల నిరోధానికి కంకిపాడు పోలీసులు ప్రణాళికతో పనిచేస్తున్నారు.

గ్రామాల్లో పటిష్ట నిఘా..

గ్రామాలపై నిఘా పటిష్టంగా ఉంటేనే నేరాలు అదుపు చేయటం సాధ్యం. శాంతిభద్రతల పరిరక్షణకు ఆస్కారం ఉంటుంది. నిఘాను పటిష్టం చేసి


కంకిపాడు పీఎస్‌లో సీసీ కెమెరాల ఫుటేజ్‌ను పరిశీలిస్తున్న ఎస్‌ఐ సందీప్

గ్రామాలపై పర్యవేక్షణ పెంచేందుకు గానూ కంకిపాడు పోలీసులు అడుగడుగునా సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. కంకిపాడు ప్రధాన సెంటరుతో పాటుగా పోలీసుస్టేషన్ పరిధిలోని విజయవాడ-మచిలీపట్నం జాతీయ రహదారి, కంకిపాడు-గన్నవరం రోడ్డు, లాకురోడ్డు, గుడివాడ రోడ్డు మార్గం పూర్తి స్థాయిలో కవర్ అయ్యే విధంగా ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాలను అమర్చారు. అంతేకాకుండా కళాశాలలు, పాఠశాలలు, వ్యాపార సముదాయాలు అధికంగా ఉన్న ప్రదేశాల్లోనూ నిఘా పెంచేందుకు సీసీ కెమెరాలను ఏర్పాటుచేశారు. మండలం వ్యాప్తంగా అతి సమస్యాత్మక, సమస్యాత్మక ప్రాంతాలను ఎంపిక చేసుకుని ఇప్పటికే 35కి పైగా కెమెరాలను ఏర్పాటుచేసి ఫుటేజ్ అంతా వీక్షించే విధంగా కంకిపాడు పోలీసుస్టేషన్‌లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

అనుమానితులు, ఆకతాయిల ఆటకట్టు..

రోడ్డు ప్రమాదాల్లో ప్రమాదానికి కారణమైన వాహనాలను గుర్తించటంతో పాటుగా ఆయా ప్రాంతాల్లో చోటుచేసుకున్న ప్రతి ఒక్క సన్నివేశాన్ని పోలీసులు వీక్షిస్తున్నారు. ప్రత్యేకించి మద్యం అక్రమ రవాణా, ఇసుక రవాణాలకు పాల్పడే వ్యక్తులను గుర్తించి అదుపులోకి తీసుకుంటున్నారు. విద్యాసంస్థల వద్ద నిఘా పెంచి ఆకతాయిల ఆగడాలకు చెక్ పెడుతున్నారు. అనుమానాస్పదంగా సంచరించే వ్యక్తులపై నిఘా ఉంచి వారి చర్యలు, కదలికలను నిరంతరం పరిశీలిస్తూ నేరాల అదుపునకు ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపుతున్నారు.

గ్రామాలపై మరింత పర్యవేక్షణ..

గ్రామాలపై పర్యవేక్షణ మరింత పెరిగేలా పోలీసులు చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే సమస్యాత్మక ప్రాంతాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. అంతేకాకుండా పూర్తి స్థాయిలో అన్ని గ్రామాల కూడళ్లు, విద్యాసంస్థల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటుచేసేలా అడుగులు వేస్తున్నారు. అంతేకాకుండా అపార్టుమెంట్లు, భవన సముదాయాలు, దుకాణాల వద్ద యజమానులతో సంప్రదింపులు జరిపి సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకునేలా చైతన్యం చేస్తున్నారు. నేరాల నియంత్రణకు దోహదపడతాయంటూ ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.

నిఘాను పెంచుతున్నాం..

అనుమానితులు, ఆకతాయిలు, శాంతిభద్రతల విఘాతానికి కారణమయ్యే వ్యక్తులను అనునిత్యం గుర్తించి నిఘా పెట్టేందుకు సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నాం. నిఘాను పెంచుతున్నాం. పోలీసు కనుసన్నల నుంచి నేరం చేసిన ఏ ఒక్కరూ తప్పించుకోకుండా పటిష్టంగా పర్యవేక్షిస్తున్నాం. దుకాణదారులు, అపార్టుమెంటు వాసులు కూడా తమ పరిసరాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలి. శాంతిభద్రతల పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి.
– డి.సందీప్, ఎస్‌ఐ, కంకిపాడు

క్లుప్తంగా

ఎంపీపీ చీలి కల్పనకు పరామర్శ



ఉయ్యూరు: ఉయ్యూరు ఎంపీపీ చీలి కల్పనను వైఎస్సార్ సీపీ పెనమలూరు నియోజకవర్గ సమన్వయకర్త దేవభక్తుని చక్రవర్తి ఆదివారం పరామర్శించారు. అనారోగ్యంతో ఇటీవల ఎంపీపీ కల్పన భర్త కోటేశ్వరరావు మృతి చెందారు. విషయం తెలుసుకున్న చక్రవర్తి కలవపాముల వెళ్లి ఎంపీపీ కల్పన కుటుంబాన్ని పరామర్శించారు. రూ.20 వేలు ఆర్థిక సాయాన్ని అందించి, అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ పానుగుమాటి బాలస్వామి, నాయకులు చేబత్తిన నాని తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికుల సేవలు భేష్



ఉయ్యూరు: పారిశుద్ధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివని మున్సిపల్ చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ(నాని) అన్నారు. మండలంలోని గండిగుంట గ్రామంలోని ఆయన నివాసంలో పారిశుద్ధ్య కార్మికులకు ఆదివారం సత్కరించారు. మహిళా కార్మికులకు చీరలు అందజేశారు. ఈ సందర్భంగా చైర్మన్ వల్లభనేని మాట్లాడుతూ ప్రజారోగ్య పరిరక్షణలో పారిశుద్ధ్య కార్మికుల పాత్ర కీలకమన్నారు. కార్మికులు తమ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలన్నారు. కార్మికుల సంక్షేమానికి కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో కమిషనర్ పాయసం వెంకటేశ్వరరావు, శానిటరీ ఇన్‌చార్జి సంతోష్, ఏఈ రాజేష్, ఇన్‌చార్జి మేనేజర్ రఘుబాబు, పలువురు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

పాతపాడు గ్రామంలో దుస్తుల పంపిణీ



పాతపాడు(విజయవాడరూరల్): దసరా పండుగను పురస్కరించుకొని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు కలపాల అబ్రహం, ఆయన కుమారులు కార్తీక్, కౌశిక్ చేతుల మీదుగా పాతపాడు గ్రామ పంచాయతీలోని పారిశుద్ధ్య కార్మికులకు శనివారం దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జాలాది గాంధీ, ముల్లంగి రాజు, నల్లమోతు చినబాబు, డేవిడ్, రమేష్, జూనపూడి కృష్ణ, బి.కుమార్, కె.సురేష్ పాల్గొన్నారు.

దుర్గమ్మ భక్తులకు దాతల సహకారం



గన్నవరం: ఇంద్రకీలాద్రిపై కొలువైన శ్రీకనకదుర్గమ్మను దర్శించుకునేందుకు వెళ్తున్న భక్తులకు పలువురు దాతలు స్వచ్ఛందంగా ముందుకువచ్చి అల్పాహారం, తాగునీరు, మజ్జిగ, పండ్లు పంపిణీ చేశారు. స్థానిక యాదవుల రామాలయం వద్ద పలువురు దాతల సహకారంతో ఉదయం, సాయంత్రం భక్తులకు అల్పాహారం పంపిణీ చేశారు. స్థానిక గాంధీబొమ్మ సెంటర్‌లో జనసేన నాయకులు గరికపాటి శివశంకర్ ఆధ్వర్యంలో భవానీలకు ఫ్రూట్స్, మజ్జిగ, డ్రింక్, వాటర్ బాటిల్స్, మెడిసిన్స్‌తో కూడిన కిట్లను అందజేశారు. ఆ పార్టీ నేతలు పచ్చిపాల లక్ష్మణరావు, కోలవెన్ను నాని తదితరులు పాల్గొన్నారు. స్థానిక పెట్రోల్ బంక్ వద్ద ఫ్రూట్స్ మర్చంట్స్ ఆధ్వర్యంలో భక్తులకు మజ్జిగ, వాటర్ బాటిల్స్ పంపిణీ చేశారు. కేసరపల్లిలోని సాయిబాబా మందిరం వద్ద పలువురు దాతలు భవానీలకు అల్పాహారం, భోజన సదుపాయం కల్పించారు.

భక్తిశ్రద్ధలతో సాయిబాబా సమాధి ఉత్సవం



పెనమలూరు: పోరంకి శ్రీనివాసనగర్‌లో శ్రీ షిర్డీ సాయిబాబా మందిరంలో ఆదివారం బాబా 106వ సమాధి ఉత్సవాన్ని భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సాయిబాబాను ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు బాబాను దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఏర్పాట్లను మందిరం కమిటీ అధ్యక్షుడు మున్నంగి అర్జున్‌రెడ్డి, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

ఆర్‌అండ్‌బీ రహదారికి మరమ్మతులు


రోడ్డు పనులను చేయిస్తున్న సర్పంచ్ బాలస్వామి

ఉయ్యూరు: విజయవాడ నుంచి కలపాముల మీదుగా గుడివాడ వెళ్లే ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారి గోతులమయంగా మారింది. కలవపాముల వద్ద పెద్ద పెద్ద గోతులు ఏర్పడి వాహనదారులు రాకపోకలు సాగించలేని పరిస్థితి నెలకొంది. గోతుల కారణంగా నిత్యం వాహనాలు ప్రమాదాల బారిన పడుతున్నాయి. గోతుల్లో పడి ఇరుక్కుపోతున్న వాహనాలను కలవపాముల సర్పంచ్ పానుగుమాటి బాలస్వామి తన సొంత ట్రాక్టరుతో బయటకు లాగి సాయం అందిస్తున్నాడు. తన గ్రామం వద్ద రహదారి గోతుల సమస్యను పరిష్కరించేందుకు సొంత ఖర్చులతో జేసీబీతో గోతులను పూడ్చి, రాకపోకలకు వీలుగా మార్గాన్ని సరిచేయిస్తున్నాడు. వైఎస్సార్ సీపీ పెనమలూరు నియోజకవర్గ సమన్వయకర్త దేవభక్తుని చక్రవర్తి, గ్రామస్తులు సర్పంచ్‌ను అభినందించారు.

దేవభక్తుని సుబ్బారావును సన్మానించిన ఫాదర్లు


పోరంకిలో దేవభక్తుని సుబ్బారావును సన్మానిస్తున్న ఫాదర్లు, దైవ సేవకులు

పెనమలూరు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు దేవభక్తుని సుబ్బారావును పోరంకి సీఎస్ఐ చర్చిలో ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఫాదర్లు మాట్లాడుతూ.. దేవభక్తుని సుబ్బారావు పేద, బడుగు, బలహీన వర్గాలు, ప్రార్థనా మందిరాలకు దానాలు, విరాళాలు ఇచ్చిన గొప్ప వ్యక్తి అన్నారు. సుబ్బారావు నిరంతర ప్రజాసేవకుడని, ఆయన చేసిన సేవలు మరువలేనివని కొనియాడారు. భవిష్యత్తులోనూ సుబ్బారావు సేవలు అన్ని వర్గాల వారికి అందించాలని కోరారు. ఈ సందర్భంగా ప్రభువు చల్లగా చూడాలని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఫాదర్లు, దైవ సేవకులు, చర్చి సంఘీయులు పాల్గొన్నారు.

కోదండ రామాలయంలో విశేష పూజలు


ధ్వజస్తంభానికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

గన్నవరంరూరల్: మండలంలోని సావరగూడెం గ్రామంలో శ్రీ కోదండ రామాలయం ధ్వజస్తంభానికి 124 కిలోల ఇత్తడి తొడుగును గ్రామానికి చెందిన మద్దుకూరి సత్యన్నారాయణ జ్ఞాపకార్థం ఆయన కుమారుడు విజయకుమార్, స్వర్ణకుమారి దంపతులు అందజేశారు. ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి దాతను అభినందించారు. లక్ష్మణ సమేత శ్రీ సీతారాముల విగ్రహ దాత కడియాల సత్యప్రసాద్, ధ్వజస్తంభ దాత కరేటి కొండలరావును ఎమ్మెల్యే అభినందిస్తూ గ్రామంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు మరింతగా జరగాలని ఆకాంక్షించారు. ఆలయ కమిటీ, యువత పాల్గొన్నారు.

అధ్వాన రహదారులతో ప్రజలకు అవస్థలు


కంకర పోసి వదిలివేసిన సావరగూడెం రహదారి


వీరపనేనిగూడెంలో ప్రధాన రహదారి దుస్థితి

గన్నవరంరూరల్: మండలంలోని గ్రామ పంచాయతీల్లో అంతర్గత రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. ఇటీవల వర్షాలకు పరిస్థితి మరింత దారుణంగా మారింది. గ్రామాల్లోనూ అంతర్గత రోడ్ల నిర్వహణ, నిర్మాణం ప్రశ్నార్థకంగా మారాయి. గూడవల్లి నుంచి జక్కులనెక్కలం వెళ్లే రహదారి గోతులు, గుంతలమయంగా ఉంది. కేసరపల్లి-సావరగూడెం గ్రామాల మధ్య రహదారి కుంగి విరిగిపోయినా ఇప్పటి వరకూ చర్యలు తీసుకోలేదు. కంకరుతో ఆ గోతులు కప్పిపెట్టారు. వీరపనేనిగూడెం గ్రామంకు వెళ్లే ప్రధాన రహదారి నడిచేందుకు వీలు లేకుండా ఉంది. ఈ మార్గాల్లో ప్రయాణం చేయాలంటే బిక్కు బిక్కుమంటూ ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణాలు కొనసాగిస్తున్నారు. నేషనల్ హైవే ఫ్లై ఓవర్ నుంచి గోపవరపుగూడెం మీదుగా గొల్లనపల్లి వెళ్లే మార్గంలో పలు చోట్ల ప్రమాదకరంగా గోతులు ఏర్పడ్డాయి. వీటిని మరమ్మతులు చేసేందుకు పంచాయతీ రాజ్, ఆర్‌అండ్‌బీ శాఖలు ఏ మాత్రం చర్యలు తీసుకోవటం లేదని పలువురు వాపోతున్నారు. మండలంలోని రహదారులకు వెంటనే మరమ్మతులు చేయించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

వయో వృద్ధాశ్రమ మందిరం ప్రారంభం


వృద్ధాశ్రమాన్ని ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే బాలవర్ధనరావు

ఉంగుటూరు: వృద్ధుల సంక్షేమానికి దాతలు ముందుకు రావడం అభినందనీయమని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దాసరి వెంకట బాలవర్ధనరావు అన్నారు. మండల పరిధిలోని కొయ్యగూరపాడులో పాతూరి కుటుంబ సాంబశివరావు జ్ఞాపకార్థం వారి కుమారుడు రాంబాబు, మనవడు డాక్టర్ రత్నాకర్‌లు రూ.4 లక్షలతో వయో వృద్ధుల విశ్రాంతి మందిరాన్ని నిర్మించారు. విశ్రాంతి భవనాన్ని మాజీ ఎమ్మెల్యే శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మాధవి, ఎంపీటీసీ దాసరి బాపినీయుడు, కొరివి పార్థసారధి పాల్గొన్నారు.

ఉత్కంఠభరితంగా తాడిగడప మద్యం షాపులు

పెనమలూరు: మండల పరిధిలో మద్యం షాపుల వ్యవహారం ఉత్కంఠభరితంగా మారింది. టీడీపీ నేతలు మద్యం వ్యాపారులను రింగ్ చేసి ఏకపక్షంగా టెండర్లు వేయాలని చేసిన యత్నం బెడిసికొట్టింది. ప్రధానంగా అత్యధిక జనాభా ఉన్న తాడిగడప మున్సిపాలిటీకి కేవలం 3 మద్యం షాపులే కేటాయించటంతో తీవ్ర పోటీ ఏర్పడింది. తాడిగడపలో మద్యం షాపులు తక్కువగా కేటాయించటంతో ప్రభుత్వ ఆదాయానికి కూడా గండిపడింది. తాడిగడప మున్సిపాలిటీలో 3 మద్యం షాపులకు ఏకంగా 160 దరఖాస్తులు అందాయి. దరఖాస్తు రుసుం కింద ప్రభుత్వానికి రూ.32 కోట్ల ఆదాయం వచ్చింది. పెనమలూరు మండలంలో 5 మద్యం షాపులు కేటాయించగా ఒక్కో షాపునకు సగటున 20 దరఖాస్తులు వచ్చాయి. ఈ షాపులకు నిబంధనలు కఠినతరం చేయడంతో పోటీ తగ్గింది. మున్సిపాలిటీకి 2 కిలోమీటర్ల దూరంలో పెనమలూరు మద్యం షాపులు ఉండాలని నిబంధన విధించారు. కాగా నేడు లాటరీ పద్ధతిలో అధికారులు షాపులు కేటాయించనున్నారు. అందరి దృష్టి తాడిగడప 3 మద్యం షాపులపైనే ఉంది. మద్యం దుకాణాలు ఎవరు దక్కించుకుంటారో చూడాలి.

పీఎం సూర్య ఘర్‌పై నేడు అవగాహన

ఉయ్యూరు: పీఎం సూర్య ఘర్ మఫ్త్ బిజిలీ యోజన పథకంపై అవగాహనా కార్యక్రమం సోమవారం నిర్వహిస్తున్నట్లు విద్యుత్ శాఖ ఉయ్యూరు ఈఈ కృష్ణనాయక్ తెలిపారు. స్థానిక విలేకరులతో ఆదివారం ఆయన మాట్లాడుతూ.. కేసీపీ ఆడిటోరియంలో సోమవారం సాయంత్రం 4 గంటలకు అవగాహన సదస్సు జరుగుతుందన్నారు. పథకం అమలులో భాగంగా గృహ అవసరాలకు సౌర విద్యుత్ ప్యానెల్స్ అమర్చటం ద్వారా కలిగే ప్రయోజనాలు, ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీ, విద్యుత్ బిల్లులు తగ్గే అంశాలపై వినియోగదారులకు అవగాహన కల్పిస్తామన్నారు. సదస్సులో ఉయ్యూరు, తోట్లవల్లూరు మండలాల విద్యుత్ వినియోగదారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ఎన్‌జీఓలు పాల్గొనాలని కోరారు.

వైభవంగా ముగిసిన దసరా ఉత్సవాలు


ఉప్పలూరులో ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు


కళాకారులను సత్కరిస్తున్న మున్సిపల్ మాజీ చైర్మన్ జంపాన


చినకంచిలో కుంకుమ పూజ చేస్తున్న మహిళలు


శ్రీ రాజరాజేశ్వరీ దేవిగా పేరంటాలమ్మ


శ్రీలక్ష్మీతిరుపతమ్మను దర్శించుకుంటున్న యార్లగడ్డ, దాసరి

గన్నవరం, పెనమలూరు నియోజకవర్గాల్లోని ఆలయాల్లో దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు వైభవంగా ముగిశాయి. విజయ దశమి సందర్భంగా శనివారం ఆలయాల్లో శమీ పూజను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గత 10 రోజులుగా అమ్మవార్లు విశేష అలంకారాల్లో దర్శనమిచ్చారు. ఆదివారం అన్నసంతర్పణలు, గ్రామాల్లో అమ్మవార్లకు ఆదివారం గ్రామోత్సవం నిర్వహించారు. దీంతో గ్రామాల్లో ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసింది.
– కంకిపాడు, పెనమలూరు, ఉయ్యూరు, గన్నవరం, రామవరప్పాడు, విజయవాడరూరల్


పోరంకి సాయిబాబా మందిరంలో అమ్మవారు


యనమలకుదురు కనకదుర్గ అమ్మవారి ఆలయంలో రాజరాజేశ్వరీదేవి అలంకరణలో..

ఉద్యోగ బాధ్యతలు స్వీకరించిన డీపీఓ

విజయవాడరూరల్: ఎన్టీఆర్ జిల్లా పంచాయతీ అధికారిగా లావణ్యకుమారి ఆదివారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. సెర్ప్ సంస్థలో డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న లావణ్య కుమారిని ప్రభుత్వం సాధారణ బదిలీల్లో భాగంగా ఎన్టీఆర్ జిల్లా డీపీఓగా బదిలీ చేసింది. గతంలో ఇక్కడ డీపీఓగా పని చేసిన ఎన్వీ శివప్రసాద్ యాదవ్‌ను కృష్ణాజిల్లా డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్‌గా బదిలీ అయ్యారు.

కోడిపందేల శిబిరంపై పోలీసుల దాడి

గన్నవరం: గన్నవరం మండలం మాదాలవారిగూడెంలో గుట్టుచప్పుడు కాకుండా నిర్వహిస్తున్న జూద శిబిరంపై పోలీసులు ఆదివారం దాడి చేశారు. గ్రామ శివారులో కోడి పందేలు నిర్వహిస్తున్నట్లుగా సమాచారం అందుకున్న పోలీసులు పథకం ప్రకారం దాడి చేశారు. ఈ దాడిలో ఐదుగురు జూదరులతో పాటు రెండు కోడిపుంజులు, రూ.3 వేలు నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేశారు.

సబ్సిడీపై టమాటా, ఉల్లి విక్రయాలు

కృష్ణలంక(విజయవాడతూర్పు): కృష్ణలంక రైతుబజార్‌లో మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో సబ్సిడీపై టమాటా, ఉల్లిపాయాలు విక్రయిస్తున్నట్లు రైతుబజార్ ఎస్టేట్ ఆఫీసర్ జాన్‌విక్టర్ పాల్ తెలిపారు. ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి టమాటా రూ.48, కర్నూలు ఉల్లిపాయలు రూ.33కు అందుబాటులో ఉంచామన్నారు. వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులకు గాయాలు

పెనమలూరు: గంగూరు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులకు గాయాలు కావడంతో పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కంకిపాడు గ్రామానికి చెందిన మరీదు రవిబాబు పెనమలూరు సెంటర్‌లో జ్యూస్ షాపు నిర్వహిస్తాడు. అతను తన షాపులో పని చేసే ఉపేంద్రతో కలిసి బైక్‌పై కంకిపాడుకు వెళ్తుండగా గంగూరు గ్రామ పరిధి బందరు రోడ్డు స్పిన్నింగ్ మిల్లు వద్ద వెనుక నుంచి వచ్చిన ఆటో బైక్‌ను ఢీ కొట్టింది. ఈ ఘటనలో బైక్‌పై ఉన్న రవిబాబు, ఉపేంద్రకు గాయాలయ్యాయి. వారిని చికిత్సకు పటమటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

నేడు నున్నలో పల్లె పండుగ కార్యక్రమం

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలో సోమవారం పల్లె పండుగ కార్యక్రమం జరుగుతుందని నున్న గ్రామ పంచాయతీ కార్యదర్శి జీటీవీ రమణ తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్ పాల్గొని గ్రామంలో ఉపాధి నిధులు 25 లక్షల రూపాయలతో చేపట్టే సీసీ రోడ్డు, డ్రెయిన్ల పనులకు శంకుస్థాపన చేస్తారన్నారు. అనంతరం గ్రామ పంచాయతీ నిధులు రూ.53 లక్షలతో నిర్మించే సీసీ రోడ్డు నిర్మాణం పనికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొంటారన్నారు.

వివాహిత అదృశ్యంపై కేసు నమోదు

పెనమలూరు: కానూరులో వివాహిత అదృశ్యంపై పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ వెంకటరమణ తెలిపిన వివరాల ప్రకారం కానూరు వినాయక్‌నగర్‌లో చేకూరి శ్రీరామ్ భార్య దేవిశ్రీ, ఇద్దరు మగ, ఒక ఆడపిల్ల (4 నెలలు) నివాసం ఉంటున్నారు. వీరు ఏడేళ్ల క్రితం ప్రేమించి వివాహం చేసుకున్నారు. అయితే భార్య తాను ఏదైనా ఉద్యోగం చేస్తానని చెప్పటంతో భర్త వద్దని పిల్లలను చూసుకోవాలని తెలిపాడు. ఈక్రమంలో ఈ నెల 5వ తేదీన తెల్లవారుజామున భార్య బట్టలు సర్దుకోని ఇంట్లో పిల్లలను వదిలేసి వెళ్లిపోయింది. పాప ఏడుస్తుందని భర్త సీతారామ్ లేచి చూడగా భార్య దేవిశ్రీ ఇంట్లో కనబడలేదు. ఆమె ఫోన్ స్విచ్చాఫ్ వచ్చింది. భార్య కనబడక పోవటంతో భర్త పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

ప్రొఫెసర్ సాయిబాబా మృతికి సంతాపం

పెనమలూరు: ప్రజల హక్కుల కోసం పోరాడి, అక్రమంగా నిర్బంధానికి గురైన ఢిల్లీ యూనివర్సిటీ ప్రొఫెసర్ జీఎన్.సాయిబాబా అనారోగ్యంతో మరణించటం తీరని లోటని కృష్ణాజిల్లా కుల నిర్మూలన పోరాట సమితి అధ్యక్షుడు తుమాటి శ్రీరాములు అన్నారు. ఆయన ఆదివారం వివరాలు తెలుపుతూ ప్రొఫెసర్ సాయిబాబా ప్రజల హక్కుల కోసం తుదిశ్వాస వరకు పోరాటం చేశారన్నారు. ఆయనను రాజహింసకు గురి చేస్తూ ప్రభుత్వం జైల్లో అక్రమంగా దశాబ్దం పాటు నిర్బంధించగా అత్యున్నత న్యాయస్థానం విచారించి నిర్దోషిగా విడుదల చేసిందన్నారు. నేడు ప్రొఫెసర్ సాయిబాబా మన మధ్యలో లేకున్నా ఆయన ఆశయాలు ఉన్నాయని తెలిపారు. హైదరాబాద్‌లో సోమవారం సాయిబాబా అంతిమ యాత్ర జరుగుతుందన్నారు. ప్రొఫెసర్ సాయిబాబాకు శ్రీరాములు విప్లవ జోహార్లు తెలిపారు.